క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న శ్రీనిజ, మనీషా

కొత్తగూడెంఅర్బన్: దుర్గాసాయి నృత్యనికేతన్ విద్యార్థులు శ్రీరాముల శ్రీనిజ, రాగుల మనీషా ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో నృత్య ప్రదర్శన నిర్వహించారు. దాదాపు రెండు గంటలపాటు సాగిన నృత్యం ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో సినీనటి అరుణ భిక్షు, శ్రీహరి రామమూర్తి, కొత్తగూడెం క్లబ్ సెక్రటరీ పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



కొత్తగూడెంటౌన్: ఆర్థిక సాయం అందజేస్తున్న సీఐలు శ్రీనివాస్, కరుణాకర్

కొత్తగూడెంటౌన్: ఖమ్మం జిల్లా వేంసూరు మండలం బీరవల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థి గార్లపాటి కార్తీక్‌కు మాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు, న్యాయవాది మారపాక రమేశ్ ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి గార్లపాటి కార్తీక్‌కు స్పెషల్ బ్రాంచ్ సీఐ చెన్నూరి శ్రీనివాస్, కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ నగదు అందజేసి, మాట్లాడారు. కొత్తగూడెంలోని ప్రైవేట్ కళాశాలలో బీఫార్మసీ చదువుతున్న కార్తీక్‌కు హాస్టల్ వసతి కోసం సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్ సభ్యులు మధుకృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన పూనెం రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం రాధమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు కొర్సా రమేశ్, ఉసికల వెంకటేశ్వర్లు, మల్కం వీరభద్రం పరామర్శించారు.రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కల్తి హనుమంతు, పూనెం పెద్ద నరసింహారావు, పూనెం చిన్న నరసింహారావు, కుంజా సతీష్, పూనెం రాములు, ఈసం పాపారావు, కొడెం చిట్టిబాబు, పూనెం రాంబాబు, ముత్తారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

సుజాతనగర్: సుజాతనగర్ పరిధిలో పాత ముత్యాలమ్మ గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని శరన్నవరాత్రుల ఉత్సవాల అనంతరం ఆదివారం శోభాయాత్ర నిర్వహించి, నిమజ్జనం చేశారు. డప్పు వాయిద్యాల నడుమ యువతులు, మహిళలు నృత్యాలతో సుజాతనగర్ వీధుల్లో అమ్మవారి ఊరేగింపును జరిపారు. అనంతరం అమ్మవారిని గంగఒడికి చేర్చారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు: పిడుగుపాటుతో తీవ్రంగా గాయపడి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంపురంతండాకు చెందిన బాధితులు కొర్రా కవిత, కొర్రా ఝాన్సీ (జాను), కొర్రా సంతోష్‌ను ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పరామర్శించారు. నాయకులతో కలిసి ఆస్పత్రిని సందర్శించిన ఆయన.. బాధితుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లాడి నరసింహారావు, మాళోత్ మంగీలాల్‌నాయక్, మాళోత్ విగ్నేష్, లకావత్ లచ్చు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయం..

- ఊడి పడుతున్న స్లాబ్ పెచ్చులు
- అయినా పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఆందోళనలో పాఠకులు, సిబ్బంది



టేకులపల్లి గ్రంథాలయం భవనం (ఇన్‌సెట్) స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్న దృశ్యం

టేకులపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. నేమ్ బోర్డు కూడా సరిగా లేక ఎవరూ గుర్తించని దుస్థితి నెలకొంది. గోడలకు బీటలు వారి స్లాబ్ పెచ్చులు ఊడిపడుతూ కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాఠకులు, గ్రంథాలయ నిర్వాహకులు భయాందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే..

2007లో నిర్మాణం..

మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం వెనుక 2007లో అప్పటి ఖమ్మం ఎంపీ రేణుకాచౌదరి నిధులతో ఈ భవనం నిర్మించి ప్రారంభించారు. అప్పట్లో సుమారు రెండు వేల మంది పాఠకులు గ్రంథాలయానికి వచ్చేవారు. విజ్ఞానం పెంపొందించే వివిధ రకాల పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచారు. వీటిని వినియోగించుకుని ఎందరో ఉన్నతస్థాయికి చేరారు. అలాంటి ఈ గ్రంథాలయానికి ప్రస్తుతం ఆదరణ కరువైంది. వర్షం పడితే స్లాబ్ నుంచి నీరు లోపలికి వచ్చి చమ్మ రావడం, పెచ్చులు ఊడి కింద పడుతుండటం నిత్య కృత్యంగా మారింది. పుస్తకాల గదిలో తరుచూ పెచ్చులు ఊడి పడుతున్నాయి. గతంలో పని చేసిన లైబ్రేరియన్ పెచ్చులు ఊడి పడుతుండగా తృటిలో తప్పించుకున్నారు. గ్రంథాలయానికి ప్రహరీ లేదు. కిటికీలు, తలుపులు చెదలు పట్టి దెబ్బతింటున్నాయి. పాములు సైతం లోపలికి ప్రవేశిస్తున్నాయి.

ఎమ్మెల్యే, దాతలు స్పందించాలి

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సొంత మండల కేంద్రంలో గ్రంథాలయం ఈ స్థితిలో ఉండటం బాధాకరమని పలువురు చెబుతున్నారు. నూతన గ్రంథాలయ భవనానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సింగరేణి నిధులు మంజూరు చేయించే అవకాశం ఉంది. మరోవైపు మండలంలోని తాజా, మాజీ ప్రతినిధులు, లైబ్రరీలో చదివి వివిధ ఉన్నత హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ప్రముఖులు, గ్రామపెద్దలు, యువతీ, యువకులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు ఆర్థిక సాయం అందిస్తే గ్రంథాలయానికి పూర్వ వైభవం తీసుకురావొచ్చు.

పోటీ పరీక్షల పుస్తకాలు లేక..

గ్రంథాలయంలో గతంలో వందల సంఖ్యలో తాజా సమాచారం, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు ఉండేవి. ప్రస్తుతం విలువైన పుస్తకాలకు చెదలు పట్టి పాడై పోయాయి. కొన్ని పాత పుస్తకాలు మాత్రమే ఉన్నాయి. తాజా సమాచారం, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు లేకపోవడంతో పాఠకుల స్పందన కూడా అంతంత మాత్రంగానే ఉంది. అనేకమంది నిరుద్యోగులు హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ లైబ్రరీలో చదువుకుంటున్నారు. టేకులపల్లిలోనే నూతన భవనం నిర్మించి తాజా సమాచారం, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచితే నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి కేవలం మరమ్మతులతో సరిపెట్టకుండా కొత్త భవనం మంజూరు చేయాలని, అన్ని రకాల తాజా పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, నూతన భవనం మంజూరయ్యేంత వరకు ఏదైనా వేరే భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చాలని పాఠకులు కోరుతున్నారు.

భవనం మంజూరు చేయాలి..



గతంలో పాఠకుల సంఖ్య ఎక్కువగా ఉండేది. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అన్ని రకాల పుస్తకాలు లేవు. నూతన భవనం మంజూరు చేయాలి. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. నూతన భవనం మంజూరయ్యే వరకు వేరే భవనంలోకి మార్చాలి.

–నోముల భానుచందర్, టేకులపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..



ఈ గ్రంథాలయానికి నేను ఇటీవలె వచ్చాను. భవనం స్లాబ్ పైన పెచ్చులు ఊడుతున్నాయి. కిటికీలు, తలుపులు సరిగా లేవు. ప్రస్తుతం పాత పుస్తకాలే ఉన్నాయి. కొత్త పుస్తకాలు ఇంకా రాలేదు. వీటన్నింటి గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాను. నిధులు మంజూరు చేస్తే కొత్త భవనం నిర్మిస్తాం.

–ఆర్.నాగన్న, లైబ్రేరియన్, టేకులపల్లి

అధ్వానంగా రహదారి



తూర్పుగూడెం - స్టేషన్ బేతంపూడి రహదారి

టేకులపల్లి: మండల కేంద్రం నుంచి వయా ప్రెగళ్లపాడు మీదుగా తూర్పుగూడెం నుంచి సుజాతనగర్ మండలం స్టేషన్ బేతంపూడి మధ్య 1.5 కిలోమీటర్ల రహదారి అత్యంత దారుణంగా మారింది. టేకులపల్లి నుంచి కొత్తగూడెం మీదుగా సుజాతనగర్‌కు వెళ్లాలంటే సుమారు 30 కిలోమీటర్లు అవుతుంది. టేకులపల్లి మండలం ప్రెగళ్లపాడు, తూర్పుగూడెం మీదుగా సుజాతనగర్‌కు కేవలం 15 కిలో మీటర్లు మాత్రమే. ఈ మార్గంలో పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించి, బీటీ రోడ్డు వేస్తే 15 కిలోమీటర్ల దూరభారం తగ్గుతుంది. కానీ, దశాబ్దాలుగా వాహనదారులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు తదితరులు ఈ కచ్చా రోడ్డుపైనే ప్రయాణాలు సాగిస్తున్నారు. చినుకు పడితే చాలు ఈ దారి బురదమయం అవుతుంది. మరో వైపు ఇదే మార్గంలో రోజూ 30 నుంచి 50 వరకు ఇసుక ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరుగుతుండటంతో కచ్చా రోడ్డు ప్రమాదకరంగా మారుతోంది. గుంతలు ఏర్పడి ప్రయాణాలు ప్రాణసంకటంగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని, పెద్దవాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన భవనం మంజూరు చేయండి

టేకులపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలోనే ఆదివారం టేకులపల్లి లైబ్రేరియన్ ఆర్.నాగన్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిశారు. లైబ్రరీకి నూతన భవనం మంజూరు చేయాలని, ప్రస్తుతం పాత భవనంలో ఉండలేని పరిస్థితి ఉంది కాబట్టి నూతన భవనం అందుబాటులోకి వచ్చేంత వరకు మండల కేంద్రంలో ఏదైనా భవనం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.

కోటమైసమ్మకు మొక్కుల చెల్లింపు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర కొనసాగుతోంది. దసరా పర్వదినాన మొదలైన జాతరకు భక్తజనం ఇంకా పోటెత్తుతూనే ఉన్నారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సీపీఐ విజయానికి కృషి చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ జిల్లా సమితి సభ్యుడు, మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ నిరంతరాయంగా పోరాడుతోందని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఒంటరిగానే సీపీఐ పోటీ చేస్తున్నట్లు చెప్పారు. సీపీఐ అభ్యర్థుల విజయం కోసం పార్టీ శ్రేణులు పని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పొన్నెకంటి వెంకటేశ్వర్లు, యల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, యాసా రోశయ్య, వల్లమల్ల సామేలు, కిలారి ముత్యాలు, గుడిమెట్ల సీతయ్య, తూము కోటయ్య, చిమట ముత్తయ్య, కంపసాటి నాగేశ్వరరావు, బరగడ రమేష్, పాలెపు ప్రభాకర్, చీమకుర్తి సంతోష్, ఎస్కే చాంద్‌పాషా, వీరయ్య, కొండల్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మిరప పంటను పరిశీలిస్తున్న నరేశ్, రైతులు

జూలూరుపాడు: అకాల వర్షానికి పంటలు దెబ్బతిని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పుల్లుడుతండా గ్రామంలో దెబ్బతిన్న పత్తి, మిరప, వరి పంటలను రైతులతో కలిసి ఆయన పరిశీలించి, మాట్లాడారు. పుల్లుడుతండా, భోజ్యాతండా, వెనకతండా, పాపకొల్లు గ్రామాల రైతులకు చెందిన 150 ఎకరాల్లోని పత్తి, వరి, మిరప పంటలు దెబ్బతిన్నాయన్నారు. వరదకు పంట పొలాల్లో ఉన్న తైవాన్ పంపులు, పైపులు, ఎరువు కట్టలు కొట్టుకుపోవడంతోపాటు రెండు గేదెలు చనిపోయినట్లు చెప్పారు. ప్రభుత్వం పంట నష్టంపై అధికారులచే అంచనా వేయించి రైతులకు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు ధరంసోత్ స్వామి, రాంబాబు, ధర్మా, మాలోత్ స్వామి, జాటోత్ బాలు, ధరంసోత్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు

పాల్వంచ: స్థానిక పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 25 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న వారంతా ఒక్కచోట కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, లక్ష్మయ్య, రమ, వెంకటలక్ష్మి, శ్రీను, నాగమణి, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్‌దే..



మాట్లాడుతున్న పొదెం వీరయ్య

ఇల్లెందు: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సీట్లు గెలుపొందటమే లక్ష్యంగా ముందుకు సాగాలని డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. సోమవారం ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇల్లెందు, టేకులపల్లి మండలాల కాంగ్రెస్ నేతల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపుకోసం పని చేయాలని కోరారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన తర్వాత నూటికి నూరు శాతం అమలు చేశామని తెలిపారు. అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. రిజర్వేషన్‌లు తారుమారు కావటం వల్ల ఆశావహులు ఇబ్బందులు పడుతున్నారని, వారిని కూడా పార్టీ పరంగా గౌరవిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు ధర్మయ్య, నాగా సీతారాములు, దేవీప్రసన్న, కోరం సురేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, దేవ్లా, పులి సైదులు తదితరులు పాల్గొన్నారు.

'బాకీ కార్డులు ఇంటింటికీ పంచండి'



మాట్లాడుతున్న బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: ఆరు గ్యారెంటీల్లో అమలు చేయని హామీలతో కూడిన బకాయి కార్డులను ఇంటింటికీ పంచి కాంగ్రెస్ నమ్మకద్రోహాన్ని ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. మండలంలోని పలు ఎంపీటీసీ స్థానాల పరిధిలోని ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం వేములవాడ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యూరియా కష్టాలు ఎన్నడూ చూడలేదని, పరిపాలన అనుభవం, ముందుచూపు లేని కాంగ్రెస్ నేతల తీరు వల్లే ఈ దఫా రైతులు యూరియా కోసం నానా ఇబ్బందులకు గురయ్యారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ పల్లెలు అత్యధిక జాతీయ అవార్డులు సొంతం చేసుకొని ఆదర్శంగా నిలిచాయని, కాంగ్రెస్ పాలనలో అధ్వానస్థితికి చేరుకున్నాయని, కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లే పరిస్థితి లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. పల్లె పాలన బాగుండాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో నేతలు శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, దేవీలాల్‌నాయక్, ప్రమోద్, గాజీ, బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలస్తీనాకు మద్దతుగా నిలుద్దాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఇల్లెందు: పాలస్తీనా ప్రజలపై అమెరికా సామ్రాజ్యవాద అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమం నిలిపి వేయాలని ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో ఈ నెల 7న జరిగే ర్యాలీ, ఆందోళనకు మద్దతుగా సన్నాహక సమావేశం నిర్వహించగా.. మధు మాట్లాడారు. ఆయిల్‌పై అమెరికా ఆధిపత్యం కోసం పాలస్తీనా ప్రజలపై సామ్రాజ్యవాద యుద్ధం కొనసాగిస్తోందన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలు సైతం ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఈ మానవ హననాన్ని ప్రపంచ శాంతి కోరుకునే మానవులంతా తీవ్రంగా వ్యతిరేకించాలని, యుద్ధం ఆపేలా పోరాడాలని కోరారు. ఈ నెల 7వ తేదీన జేకేకాలనీ నుంచి గోవింద్‌సెంటర్ వరకు జరిగే నిరసన ర్యాలీలో అన్ని పార్టీలు, సంస్థలు, ప్రజా సంఘాలు, పార్టీల నేతలు పాల్గొనాలని కోరారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చంద్ర అరుణ(మాస్‌లైన్), ఎస్‌ఏ నబీ (సీపీఎం), బంధం నాగయ్య (సీపీఐ), ఎండీ ఘనీ (మైనార్టీ), ఎ.సాంబ (ఎన్‌డీ చంద్రన్న వర్గం), ఎట్టి ప్రశాంత్ (టీపీఎఫ్), ఆలేటి కిరణ్, రాసుద్దీన్, బాస శ్రీనివాస్, బి.సత్యనారాయణ, బి.వెంకట్రాం, కె.సారంగపాణి, యాకుబ్‌షావలి, బి.శ్యామ్, బయ్యా అభిమన్యు, గణేశ్, టి.కృష్ణ, తోడేటి నాగేశ్వరరావు, మెకాళ్ల రమేశ్, ఎస్.నాగేశ్వరరావు, ఉడుత ఐలయ్య, సరోజిని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

టేకులపల్లి: ఇల్లెందు–కొత్తగూడెం ఎన్‌హెచ్ 930పీ రహదారిలో ఏర్పడిన గుంతలకు ఆదివారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గత ఆగస్టు 21న మరమ్మతులు చేయగా.. వాహనాల తాకిడికి అదికాస్తా కొట్టుకుపోయింది. దీంతో ఆదివారం మరోసారి మరమ్మతులు చేపట్టారు. పక్కాగా మరమ్మతులు చేయకపోతే ఈ రోడ్డు నిలబడే పరిస్థితి లేదని వాహనదారులు అంటున్నారు.

నష్టాన్ని మిగిల్చిన వర్షం

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న పత్తి, మిరప పంటలు
- నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతుల వేడుకోలు



పుల్లుడుతండా పెద్దవాగు ఉప్పొంగడంతో దెబ్బతిన్న పత్తి చేను

జూలూరుపాడు: మండలంలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. సుమారు గంటకు పైగా కురిసిన కుండపోత వర్షానికి అటవీ ప్రాంతం నుంచి పుల్లుడుతండా పెద్దవాగుకు వరద పోటెత్తింది. దీంతో పెద్దవాగు పరివాహక ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లోని పత్తి, వరి, మిరప పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా పత్తి పంట సుమారు 100 ఎకరాల్లోను, మరో 50 ఎకరాల్లో మిరప, వరి పంటలు వరదనీటి ఉధృతి కారణంగా కొట్టుకు పోవడంతోపాటు, ఇసుక మేటలు వేశాయి. చేతికి వచ్చిన పంట వర్షానికి కొట్టుకుపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. పుల్లుడుతండా, వెనకతండా, భోజ్యాతండా, భీమ్లాతండా, పాపకొల్లు గ్రామాల్లో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో పంటలు కొట్టుకుపోయాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జూలూరుపాడు మండలవ్యాప్తంగా సుమారు 20,000 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, మిరప 5,000 ఎకరాల్లో సాగు అయింది. వరుస తుఫాన్ల ప్రభావంతో కుండపోత వానలకు పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే పత్తి కాయలు నల్లబడి పోవడంతోపాటు, పూత, పిందె, కాయలు రాలిపోయాయి. దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి పరిహారాన్ని అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పెద్దవాగుతోపాటు, అలుగు వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో గుండ్లరేవు, బేతాళపాడు బ్రిడ్జిల పైనుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఐదు ఎకరాల్లో నష్టం..



10 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాం. అకాల వర్షంతో పుల్లుడుతండా పెద్దవాగు ఉప్పొంగడంతో వరద ఉధృతికి సుమారు 5 ఎకరాల్లో పత్తి పంట కొట్టుకుపోయింది. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. సాగు కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. నష్ట పరిహారం అందించాలి.

–ధరావత్ శ్రీను, రైతు వెనకతండా

పంట కొట్టుకుపోయింది



పుల్లుడుతండా పెద్దవాగు పొంగడంతో ఐదు ఎకరాల్లో పత్తి చేను కొట్టుకుపోయింది. గంటన్నర పాటు కుండపోతగా వాన పడింది. పెద్దవాగు పొంగిపొర్లడంతో ఇసుక, ఒండ్రుమట్టి మేట వేయడంతో సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం ఏర్పడింది. నష్టంపై అంచనా వేసి పరిహారం అందించాలి.

–ధరంసోత్ స్వామి, రైతు పుల్లుడుతండా

నష్టపరిహారం చెల్లించాలి



6 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, పెట్టుబడి రూ.1.80 లక్షలు అయింది. పెద్దవాగు పొంగడంతో ఎకరం పత్తి చేను కొట్టుకుపోయింది. పంట చేతికి వచ్చిన సమయంలో వర్షంతో తీవ్ర నష్టం వచ్చింది. అప్పు ఎలా తీర్చాలో తెలియడంలేదు. నష్టపోయిన పంటకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి.

–ధరావత్ నాగు, రైతు వెనకతండా